"తాడుని కోసేస్తే కిందపడి మరణించనూ? నువ్వు దేవుడివి కావు."

"నమ్మకపోతే అది నీ ఇష్టం."

మర్నాడు అతన్ని వెదుకుతూ వచ్చినవారు, తాడుకి వేలాడే మంచుకి గడ్డకట్టుకుని మరణించిన అతని శవాన్ని చూసారు. అంతే కాదు. అతని కాళ్ళకింద కేవలం అడుగున్నర దూరంలో చదునుగా ఉన్న పెద్ద రాయి ఉంది! దేవుణ్ణి పరిపూర్ణ విశ్వాసంతో నమ్మాలి.

## 140. గీతా భాష్యం

తన కొడుక్కి బదిలీ అవడంతో ఓ చిన్న ఊరుకి ఓ ముసలావిడ వచ్చింది. వాళ్ళు అద్దెకుండే ఇంటికి దగ్గర్లో ఉన్న చిన్న సూపర్ బజార్‌కి ఆవిడ తరచూ వెళ్ళి ఇంటికి కావల్సిన సరుకులు తీసుకువస్తూండేది. అక్కడి సేల్స్‌మెన్ ఆవిడని 'మామ్మగారు' అంటూ ఆప్యాయంగా పిలిచేవారు. చదవడం రాని ఆవిడ భగవద్గీతని టేప్ రికార్డర్‌లో వినేది.

ఓ రోజు తన కొడుకు పుట్టిన రోజున ఆవిడ సూపర్ బజార్‌కి వెళ్ళి సామాను కొనుక్కొచ్చి పాయసం, గారెలు చేసింది. తన కొడుక్కి పెట్టాక ఆవిడ మిగిలింది తీసుకుని బయటకి వెళ్ళడం చూసిన కొడుకు అడిగాడు.

"అదేమిటి? నువ్వు తినకుండా వాటిని ఎవరికి తీసుకెళ్తున్నావు?"

"సూపర్ బజార్‌లో పనిచేసే సేల్స్‌మెన్‌కి."

"వాళ్ళకెందుకు? వాళ్ళు మనకేం కారుగా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు కొడుకు.

అందుకా తల్లి చెప్పిన సమాధానం ఇది.

" భగవద్గీత చదవడానికి నాకు చదువు రాదు. కాని గీతలోని ప్రతీ పేజీలో 'ప్రేమ' అన్న పదం రాసి ఉంటుందని నాకు తెలుసు. ప్రేమంటే మనకి ఉన్నది ఇతరులతో పంచుకోవడమే అని నా అభిప్రాయం."

ఈ సారి కొడుకు ఆవిడకి ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు.